క్లుప్తంగా

పేదింటి పెళ్లి కూతురుకు మేనమామ సాంగ్యం



బీరువా, మంచం అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణంలోని 13వ వార్డుకు చెందిన షేక్ గౌసియాకు వివాహం నిశ్చయమైంది. వారిది నిరుపేద కుటుంబం. ఈ విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బుధవారం పెళ్లి కూతురుకు బీరువా, డబుల్ కాట్ మంచం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పగడాల రాజు, నాయకులు ఫజల్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన కాశమ్మ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తన కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డి ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

గోశాలకు పశుగ్రాసం వితరణ



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు తిరుపతికి చెందిన అన్నపూర్ణ హోటల్ యజమాని కె.రాజగోపాల్, అతని మిత్రుడు పి.కేశవరావు పశుగ్రాసం వితరణ చేశారు. దీనిని బుధవారం దాతల మిత్రుడు పీజే చంద్రయ్య పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. గోశాల ఇన్‌చార్జి రాజశేఖర్, పట్టణ ప్రముఖులు తులసీకృష్ణ, కల్యాణ్ పాల్గొన్నారు.

గోసంరక్షణకు రూ.10,116 విరాళం

శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాల సంరక్షణకు శ్రీకాళహస్తికి చెందిన వీరప్పరెడ్డి, నాగేంద్రరెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.10,116 విరాళం ఇచ్చారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

సత్యవేడు: మహాత్మాజ్యోతిరావ్ పూలే వెనుకబడిన సంక్షేమ గురుకుల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శిక్షణ ఇవ్వాలని ఎంఈఓ రవి కోరారు. బుధవారం బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. స్కూల్ కమిటీ చైర్మన్ రవికుమార్ దేవర్ పాల్గొన్నారు. గత ఏడాది గురుకుల పాఠశాల విద్యార్థులు మండల టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు దండపాణి, ఏ.మాధవి, పల్లవి, శరణ్య, హరి, చలపతి, సురేష్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి - చెన్నైకి బస్సు చార్జీలు తగ్గింపు

శ్రీకాళహస్తి రూరల్: చెన్నై నుంచి శ్రీకాళహస్తి, శ్రీకాళహస్తి నుంచి చెన్నై వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు తగ్గించినట్టు శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. శ్రీకాళహస్తి నుంచి చెన్నైకి బస్సుల్లో ఇంతమునుపు రూ.155ల చార్జీ ఉండగా ఇప్పుడు రూ.135లకు తగ్గించినట్లు పేర్కొన్నారు. అల్ట్రా డీలక్స్ సర్వీసు బస్సులో రూ.185 ఉండగా ఇప్పుడు రూ.165కి తగ్గించినట్లు వివరించారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో బుధవారం సర్పంచ్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో తిరుపతి టాటా ట్రస్ట్ వైద్య సిబ్బంది ఉచిత క్యాన్సర్ నిర్ధారణ, దంత వైద్య పరీక్షలు చేశారు. గుడిమల్లం, ఎస్సీ కాలనీ, మిట్ట మీదకండ్రిగ, ఎస్టీ కాలనీ తదితర గ్రామాల నుంచి వచ్చిన 90 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవగాహనతో క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్, పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఒలంపియాడ్‌లో ది స్కూల్ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ ఒలంపియాడ్‌లో శ్రీకాళహస్తికి చెందిన ది స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. వారిని పాఠశాల కరస్పాండెంట్ బుధవారం అభినందించి బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి 6, 7, 8, 9వ తరగతులకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. హెచ్ఎం విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఈ విద్యార్థిని పేరు మణిమేఖల. రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో చదువుతోంది. ఈమె అండర్-14, అండర్-17లో చండీఘర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకాన్ని సాధించింది. స్టేట్ గ్రాప్లింగ్ పోటీల్లోనూ గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. ముున్ముందు మరింత ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతానని పేర్కొంటోంది.



ఈ విద్యార్థిని పి.రాజేశ్వరి. 7వ తరగతి నుంచి చదువుతోపాటు క్రీడలపై ఉన్న అభిరుచి మేరకు రెజ్లింగ్‌లో పీడీ రేఖారాణి మార్గదర్శకత్వంతో శిక్షణ తీసుకుంది. ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో బ్రోన్జ్ మెడల్‌ను సాధించింది. అనంతపురం దిమ్మగుడిలో జరిగిన రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ పోటీల్లో గోల్డ్ మెడల్‌ను సాధించింది.

కుస్తీతో దోస్తీ- పతకాలు జాస్తి..!

- జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తున్న బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు
- చదువులోనూ ముందుకు సాగుతున్న వైనం



విద్యార్థినులు సాధించిన కప్పులు, షీల్డులు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న విద్యార్థినులు(ఫైల్)

రేణిగుంట: వారంతా పేద కుటుంబాలకు చెందిన వారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువుల్లోనేకాక క్రీడల్లోనూ మిన్నగా రాణిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాల పంట పండిస్తున్నారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాలను కీర్తి కెరటాల్లో నిలబెడుతున్నారు.

జాతీయ పోటీలకు 17 మంది ప్రాతినిధ్యం

పిల్లలు క్రీడల్లో పాల్గొనేలా రేణిగుంట బాలికోన్నత పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధనం, పీడీ రేఖారాణి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి ఉన్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పీడీ రేఖారాణి పిల్లలతో ఎక్కువ సమయం గడుపుతూ రెజ్లింగ్, గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లో మెళకువలు నేర్పిస్తున్నారు. దీంతో ఇక్కడి నుంచే 17 మంది విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్కడ ప్రతిభ చూపి కప్పులను, మెడల్లను సొంతం చేసుకున్నారు.



ఈ విద్యార్థిని పేరు జి.జ్ఞా నగీతిక. గత ఏడాది ఉత్తరాఖండ్‌లో జరిగిన నేషనల్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్‌ను సాధించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీల్లోనూ బ్రోన్జ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. జాతీయ స్థాయిలోనే కాకుండా ప్రపంచ స్థాయి పోటీల్లో పాల్గొనడమే తన ధ్యేయమని చెబుతోంది.



ఈ విద్యార్థిని పేరు పి.గ్రేసి. ఈమె 2022లో జరిగిన జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని విశేష ప్రతిభ చూపి గోల్డ్ మెడల్‌ను సొంతం చేసుకుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, కర్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ గోల్డ్ మెడల్లను సాధించింది. బాగా చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే క్రీడలు కూడా అవసరమని ఈ విద్యార్థిని పేర్కొంటోంది.

మాకెంతో గర్వకారణం



“ మా స్కూల్‌లో చదువుతున్న విద్యార్థినులు జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికవడమే కాకుండా బంగారు పతకాలు సాధిస్తుండడం మాకు ఎంతో గర్వకారణం. విద్యార్థినుల అభిరుచిని చూసి ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగా మా పాఠశాలలో కూడా పలు రాష్ట్ర స్థాయి ఈవెంట్లను నిర్వహించాం.

– విష్ణువర్ధనం, హెచ్ఎం, బాలికోన్నత పాఠశాల, రేణిగుంట

ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం



మా స్కూల్ విద్యార్థినులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ రాణిస్తున్నారు. క్రీడలపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. మాకు ప్రధానోపాధ్యాయురాలు ఎంతో సహాయం అందిస్తున్నారు. దాతల సాయం తీసుకుని పిల్లలకు కిట్లు, క్రీడా సామగ్రి అందించారు. భవిష్యత్తులో మా పిల్లలు మరింత మెరుగ్గా రాణించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– రేఖారాణి, పీడీ, బాలికోన్నత పాఠశాల, రేణిగుంట.

సంరక్షణ కార్డుపై అవగాహన



బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : మండలంలోని సాంబయ్య పాళెం గ్రామస్తులకు బుధవారం హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు మాతా శిశు సంరక్షణ కార్డుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. పీహెచ్‌సీలో ప్రతి నెలా 9న గర్భిణులు తప్పనిసరిగా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం ఇందిరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లిఖిత్ కుమార్, ఆశా కార్యకర్తలు దుర్గ, సుమలత పాల్గొన్నారు.

ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

వరదయ్యపాళెం: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలపై దృష్టి పెట్టారు. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో ముందుకెళుతోంది. 7 మండలాల పరిధిలో జోనల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని గుర్తించే ప్రక్రియ కూడా మొదలైంది. అన్ని పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు.

ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైష్ణవి కల్యాణ మండపంలో బుధవారం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం, ఉపాధ్యాయులతో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, టీచర్ల ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థిని పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ఢిల్లీబాబు, ప్రవీణ్‌కుమార్, రవినాయుడు, చంద్రశేఖర్, సాగర్, శ్రీకాంత్‌శర్మ, రవీంద్రప్రసాద్, శివకుమార్, మునిరత్నం పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపంతోనే రక్త హీనత

ఏర్పేడు: పౌష్టికాహార లోపంతో రక్త హీనత ఏర్పడుతుందని సర్పంచ్ లలిత తెలిపారు. మండలంలోని పాపానాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతో పాటు అదనంగా తాజా కూరగాయలు, ఆకు కూరలు, పప్పు దినుసులు, మాంసపుకృత్తులతో కూడిన భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పీహెచ్‌సీలో పరీక్షలు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉష, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి భవాని తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న సర్పంచ్ లలిత

పింఛన్ల పంపిణీ



పిచ్చాటూరులో పింఛన్ ఇస్తున్న ప్రజాప్రతినిధులు

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పిచ్చాటూరు పట్టణంలో సింగిల్ విండో చైర్మన్, సర్పంచ్ కేజీ రోస్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తొప్పయ్య వలంటీర్లతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. నాగలాపురం మండలంలో సచివాలయ కన్వీనర్ మోహన్ మొదలియార్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో బుధవారం ఉదయం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేశారు.కంచనపుత్తూరులో సాయంత్రంలోపు 100 శాతం పింఛన్ పంపిణీ చేశారు. మండలంలో 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి అయ్యిందని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు.



గురవయ్యకు పింఛను ఇస్తున్న సర్పంచ్ మోహనప్రియ

సత్యవేడులో..

సత్యవేడు: మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారులకు ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గోవిందస్వామి, బాలసుబ్రమణ్యం, రాధాకృష్ణయ్య, గోపి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛను పంపిణీ

ఏర్పేడు: ఎండీపుత్తూరులో బుధవారం సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి పింఛను అందజేశారు. ఎండీపుత్తూరు ఎస్సీ కాలనీకి చెందిన పెరుగు గురవయ్య(43) కిడ్నీవ్యాధి బారిన పడ్డాడు. అతని పరిస్థితిని సర్పంచ్ ఎమ్మెల్యేకి విన్నవించారు. అధికారులు అతనికి పింఛను మంజూరు చేశారు. ఎండీపుత్తూరుకు చెందిన మునిరాజయ్య తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్పంచ్ సూచనల మేరకు వలంటీర్ గురవమ్మ స్విమ్స్‌కు వెళ్లి మునిరాజయ్యకు పింఛను అందజేశారు.

విద్యార్థులకు ఘన వీడ్కోలు



బాలికలకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

రేణిగుంట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థినులకు ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్ఎం విష్ణువర్ధనం ఆధ్వర్యంలో సరస్వతి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యూనివర్సల్ ఏసీ మార్ట్ రఘు, ఎన్ఆర్ఐ ప్రదీప్, దివాకర్ 10వ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థినులు, బాలుర బీసీ హాస్టల్ విద్యార్థులకు రాత పరీక్ష సామగ్రి వితరణ చేశారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్



ఏర్పేడు: మండలంలోని కుక్కలగుంటలో బుధవారం ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ క్యాంపు నిర్వహించారు. ఇక్కడి గిరిజనులు ఎక్కువ మంది ఆధార్ కార్డులు అప్‌డేట్, ఫోన్ నంబరు లింక్, వేలి ముద్రలు సక్రమంగా పడకపోవడం వంటి సమస్యలతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సుధాకర్ వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డికి తెలిపారు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

నీటి వృథా.. గ్రామస్తులకు వ్యథ



వేణుగోపాలపురంలో వృథాగా పోతున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురంలో తాగునీటి కొళాయిలు పాడైపోవడంతో నీరు వృథాగా పోతుంది. తాగునీటి కొళాయిల ట్యాప్ పనిచేయకపోవడంతో నీరంతా ఏరులై పారుతుంది. దీంతో నీరుచాలక దళితులు ఇక్కట్లు పడుతున్నారు. వ్యవసాయబోర్లు, బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోల్సిన దుస్థితి నెలకొంది. తాగునీటి కొళాయిలకు మరమ్మతులు చేపట్టాలని గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కొళాయిలకు ట్యాప్‌లను అమర్చి, నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పేర్నాటిని భారీ మెజారిటీతో గెలిపించండి



సురుటపల్లెలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపు

పిచ్చాటూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి శ్యామ్ ప్రసాద్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం నాగలాపురం మండలం సురుటపల్లెలో అందుబాటులో ఉన్న పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రులను గుర్తించి, జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసేలా చైతన్యపరచాలన్నారు. ఇందుకు నియోజకవర్గంలోని ఏడు మండలాల పార్టీ కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. జగనన్న పథకాలే ఎన్నికల అస్త్రంగా చేసుకుని ప్రచారంలో దూసుకెళ్లాలన్నారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ అపరంజిరాజు, పళ్లికొండేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చిన్నదొరై, పార్టీ నాయకులు జయప్రకాష్, మోహన్ మొదలియార్, సురేష్ శెట్టి, ఎస్ఎం సురేష్, రవిరెడ్డి, సుబ్రమణ్యం, మహేష్, పాల పద్మనాభం, తొప్పయ్య, గోపి, దేశప్పన్, పొన్నయ్యన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పేర్నాటిని గెలిపించండి

రేణిగుంట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి కోరారు. ఆమె బుధవారం రేణిగుంట పట్టణంలోని బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలలు, సచివాలయాల్లో ప్రచారం చేశారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సంధ్య, మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేశం, కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, జువ్వల దయాకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, ఖదీర్ పాల్గొన్నారు.



రేణిగుంటలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

వాహన మండప నిర్మాణానికి భూమి పూజ

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామి ఆలయంలో వాహన మండపం నిర్మాణానికి బుధవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ నరసింహ యాదవ్ భూమి పూజ చేశారు. పరశురామేశ్వర స్వామి వారి సేవ కోసం ఏపీ, తమిళనాడుకు చెందిన దాతలు 11 వాహనాలను అందజేశారు. వాటిని భద్రపరిచేందుకు మండపం లేదు. గున్నేరి కిషోర్‌రెడ్డి సూచనల మేరకు మండపాన్ని నిర్మించేందుకు శ్రీకాళహస్తికి చెందిన శ్రీలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ అధినేత జయరాం యాదవ్ ముందుకు వచ్చారు. సర్పంచ్ సుబ్రమణ్యం, ఆలయ ఈఓ రామ చంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, మహేష్, సురేంద్ర, రాజేశ్వరి, రామ్మూర్తి, సంతోష్ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న గున్నేరి కిషోర్‌రెడ్డి, జయరాం యాదవ్

వాహనాల తనిఖీ

రేణిగుంట: రేణిగుంట అర్బన్ సీఐ సుబ్బారెడ్డి బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్, సరైన రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. రోడ్డు నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు.

కనుల పండువగా పుష్పయాగం

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని తొండమాన్పురంలో వెలసిప టీటీడీ అనుబంధ శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పుష్పయాగం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున వేద పండితులు స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా ఫల, పుష్ప, సుగంధ, పన్నటి సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం చేశారు. అనంతరం వివిధ కనుల పండువగా పుష్పయాగం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం చేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్‌లో) పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు వేగవంతం



గరుత్మంతుని విగ్రహాన్ని తొలగిస్తున్న సిబ్బంది



ధ్వజస్తంభాన్ని తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: ప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేశారు. అందులో భాగంగా బుధవారం పరివార దేవతలు జయ విజయులు, ఆంజనేయస్వామి, గరుత్మంతుడి విగ్రహాలు, ధ్వజస్తంభం తొలగింపు పనులను పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో చేపట్టారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయ గోడలు తొలగించిన తర్వాత మూలవిరాట్ పంచనామా నిర్వహిస్తామన్నారు. ఆలయ అధికారులు సతీష్‌మాలిక్, మురళీధర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, కిషోర్, కుమార్, ప్రసాద్, లక్ష్మయ్య 1వ పట్టణ పోలీసు సిబ్బంది పెంచలయ్య, శ్రీధర్, వీఆర్వో బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.